


# న్యాయం

రాణీ మోహన్

"ఎస్......'కాంతా ఫుడ్ ప్రొడక్ట్స్' ఆఫీస్ మేనేజర్ వరప్రసాద్ హి సైడ్" అన్నాడు వరప్రసాద్.

"..................."

"ఆఁ...ఏక్సిడెంటా? ఎప్పుడు?"

"..................."

"ఆఁ...ఆఁ...వస్తున్నాం..." అని రిసీవర్ దించేసి మళ్ళా రిసీవర్ ఎత్తి ఒక నెంబర్‌కి డైల్ చేసేడు వరప్రసాద్.

"సార్, నేను వరప్రసాద్ని.. మీరూ మీ తమ్ముడు మూర్తిగారు వెంటనే అమెరికన్ ఆసుపత్రికి రండి...గంటక్రితం మీ అమ్మగారు కారులో వినాయకా కోవెల నుంచి వస్తూవుంటే కారు ప్రమాదానికి గురైంది? ఆమెకు బలంగా దెబ్బలు తగిలేయని నాకు ఫోన్ వచ్చింది. నేనూ, నాన్నగారూ బయల్దేరుతున్నాం-వుంటా సార్" రిసీవర్ దించేసి ఒక్క-సారి ఊపిరితీసుకుని ఆ గదిలోంచి బయటకు వెళ్ళాడు వరప్రసాద్.

ఆ గదికి అవతలవున్న ఎ.సి. గదిలోకి ప్రవేశించేడు వరప్రసాద్.

కాంతా ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రొప్రైటర్ నీలకంఠం దీక్షగా ఫైల్ చూస్తున్నాడు.

"సార్,"

ఫైల్‌లోంచి తలెత్తి వరప్రసాద్ వేపు చూసేడు నీలకంఠం.

"సార్, అమ్మగారికి ఏక్సిడెంట్ అయింది. పోలీస్ వాళ్ళు వెంటనే అమ్మగారిని అమెరికన్ ఆసుపత్రిలో జాయిన్

చేసేరు—ఇందాక అసుపత్రినుంచి ఎస్సై గారు నాకు ఫోన్‌చేసి చెప్పేరు. వెంటనే మీ పెద్దబ్బాయికి విషయం ఫోన్‌లో చెప్పేను" గాభరాను అణుచుకుంటూ చెప్పేడు వరప్రసాద్.

నీలకంఠం పెద్ద పేరున్న వ్యాపారవేత్త-

అతనికి ఆ నగరంలో రెండు సినిమా హాల్సు- 'కాంతా ఫుడ్ ప్రొడక్ట్సు' సంస్థ వున్నాయ్ ఫుడ్ ప్రొడక్ట్సు వల్ల ఎంతో పేరు ఆ పేరుకు తగ్గట్టుగా లాభాలూ వస్తున్నాయ్ ఎంతో మంది అన్నార్తులకు ఆ ఫుడ్ ప్రొడక్ట్సులో ఉద్యోగాలు దొరికేయ్।

నీలకంఠం- తండ్రి యిచ్చిన ఆస్తిని పదింతలుగా ఈ వ్యాపారంలో వృద్ధి చేసేడు అతడికి ఇద్దరు కొడుకులు- పెద్ద కొడుకు ఆ నగరంలో పేరుపొందిన క్రిమినల్ లాయర్. పేరు రాజా. అతడు ఆ వృత్తిలో పేరుకుపేరు డబ్బుకు డబ్బు సంపాదిస్తున్నాడు. ఇక నీలకంఠం రెండో అబ్బాయ్ మూర్తి. పేరుపొందిన సివిల్ కంట్రాక్టర్. ఆ నగరంలో (వెలిసిన) వెలుస్తున్న భవనాలన్నీ అతనే కట్టిస్తున్నారు. అతనంటే నగరంలో అందరికీ గౌరవం...

నీలకంఠం యిద్దరు కొడుకులూ వేరే యిళ్ళలో వుంటున్నారు. ఆ ఏర్పాట్లు వాళ్ళ పెళ్ళిళ్ళు అయిన వెంటనే నీలకంఠం చేసేడు.

"అదేమిటండీ... అబ్బాయిల్ని వేరే యిళ్ళలో ఉంచేరు... నాకు తోచదండీ।" అంది కాంత బాధగా.

"కాంతా, అబ్బాయిలు నీ దృష్టిలో యింకా పసిపిల్లలే। కానీ వాళ్ళ పెళ్ళాల దృష్టిలో వాళ్ళు పెద్దవాళ్ళే। ఎవరి ఊహాలు అభిరుచులూ వాళ్ళకుంటాయ్. మనం ఎదుటవుంటే వాళ్ళకు ఆటంకం...ఆ కారణంగా వారికి మనం వెగటు అవుతాం... ఫలితంగా మనం అగౌరవం పొందుతాం... అలా అవడం నాకు యిష్టం లేదు, అందుకే వేరే కాపురాలు ఏర్పాటుచేసేను. మనం వారికి దూరంగా వుంటేనే- మీకూ, వాళ్ళకి అభిమానాలు, ప్రేమ వృద్ధి అవుతుంది. ఆ నమ్మకం తోనే యీ పని చేసేను" అన్నారు నీలకంఠం.

నీలకంఠం చెప్పింది విని మరేమీ అనలేదు కాంత- నీలకంఠం ఏ పని చేసినా ఆ పనిలో లాభమే తప్ప- నష్టం వుండదన్న నమ్మకం ఆమెకు వుంది.

ఎర్రరంగు మారుతీకారు అసుపత్రి ఆవరణ ముందు ఆగింది. వరప్రసాద్ నీలకంఠం వేగంగా కారుదిగేరు. రిసెప్షన్ కౌంటర్ వద్దకు వెళ్లారు ఇద్దరూ. రిసెప్షన్‌లో వున్న అమ్మాయికి వివరాలు చెప్పేడు వరప్రసాద్.

"ఆమె ఎమర్జన్సీ రూంలో వుంది. సెకెండ్ ఫ్లోర్ రూం నెం. ఫోర్"

చెప్పింది రిసెప్షనిస్ట్ అమ్మాయి.

"థాంక్స్!" అని వెనక్కి తిరిగేడు వరప్రసాద్. నీలకంఠంవేపు చూసి తల వూపేడు ఇద్దరూ లిఫ్ట్‌వేపు దారితీసేరు-

• •

"మేడమ్‌గారికి తగిలిన దెబ్బలకు డ్రెసింగ్ చేసి కట్టుకట్టేం. దెబ్బలవల్ల ఆమెకు రక్తం బాగా పోయింది! బ్లడ్ ఎక్కిస్తే ఆమె కోలుకుంటుంది" అన్నాడు డాక్టర్ నీలకంఠంవేపు చూసి.

"అలాగే ఎక్కించండి! ఎంత ఖర్చైనా పే చేస్తాం!" అన్నారు నీలకంఠం

డాక్టర్ అలాగే అన్నట్టు తలూపి నర్సువేపు చూసేడు.

"నర్స్!"

"సార్!"

"పి. శాంతాదేవిగారి బ్లడ్ శాంపిల్ రిక్విజిషన్ రాసేవా?"

"ఆఁ... రాసేను సార్."

"వెంటనే బ్లడ్‌బ్యాంక్‌కి ఫోన్‌చేసి బ్లడ్ ఎరైంజ్ చెయ్యి-క్విక్" అన్నాడు డాక్టర్.

నర్సు వెంటనే ఫోన్‌వద్దకు వెళ్ళి రిసీవర్ ఎత్తి ఫోన్ చేసింది వెంటనే రిసీవర్ ఫోన్ రెస్ట్‌మీద వుంచి డాక్టర్ వద్దకు వచ్చింది. ఆమె మొహంలో కళ లేదు

"సార్! 'బి' గ్రూప్ బ్లడ్ స్టాకు లేదుట...!"

డాక్టర్! నీలకంఠంవేపు చూసేడు.

"సార్! నగరంలో యీ మధ్య బ్లడ్‌కు కరువు వచ్చింది. మావద్ద స్టాకు లేదు."

"మరెలా డాక్టర్!" అన్నారు నీలకంఠం ఆత్రంగా

"మీ బంధువుల మంచి గాని మీ పిల్లలమంచి గాని రక్తదానం చెయ్యడమే మార్గం-" అన్నాడు డాక్టర్

"అలాగే డాక్టర్- మేము రెడీ..." అన్నారు నీలకంఠం కొడుకులిద్దరూ...

"వోకే! మీరంతా లోపల గదిలోకి రండి" అన్నాడు డాక్టర్.

నీలకంఠం- ఇద్దరు కొడుకులూ... కొడకూ లోపలకు వెళ్ళారు. వాళ్ళ రక్తం టెస్ట్‌కిచ్చేరు. రక్తం పరీక్ష చేసేడు డాక్టర్ ఆ గ్రూప్స్ రక్తం సూటవలేదు. పెదవివిరిచేడు- డాక్టర్.

"మీవాళ్ళ రక్తం గ్రూపుకు ఆమె రక్తం గ్రూప్‌కు సరిపోలేదు సార్!" నిరాశగా అన్నాడు డాక్టర్.

"పోనీ నా రక్తం సరిపోతుందేమో" అన్నాడు నీలకంఠం చెయ్యి ముందుకు చాస్తూ...

డాక్టర్ అతని రక్తం టెస్ట్ చేసేడు.

"సార్! మీ రక్తం ఆమెకు మేచ్ అవుతుంది"

"తీసుకోండి సార్- నా భార్య నాకు దక్కాలి..." అన్నాడు నీలకంఠం.

"సార్! మీ రక్తం బాగా పల్చబడింది- మీరు పెద్దవారు... వయసు

మశ్నివవాళ్ళ మంచి రక్తం ట్రాన్స్‌మిట్ చేయకూడదు- మీరు మరో ఏర్పాటు చేయండి. ఆలస్యం చెయ్యకండి" అన్నాడు డాక్టర్.

"సార్! మీరేదోలా బ్లడ్ డోనర్స్‌ని చూడండి- వాళ్ళకి ఎంత డబ్బైనా ఇస్తాను" అన్నాడు నీలకంఠం ప్రాధేయంగా.

"సారీ! మా ఆసుపత్రిలో మనీ పుచ్చుకుని బ్లడ్ ఇచ్చే డోనర్స్ వుండరు" అన్నాడు డాక్టర్.

నీలకంఠం మనసు బాధతో నిండిపోయింది. కళ్ళు తడిసేయి. అసహాయంగా కొడుకులవేపు చూసేడు. నేరస్తుల్లా తలలు వంచేరు కొడుకులిద్దరూ!

"డాక్టర్ గారూ-" పిల్చేడు వరప్రసాద్. గుమ్మంవద్ద నిల్చున్న వరప్రసాద్‌ని చూసేడు- డాక్టర్.

"మీరు నా బ్లడ్ టెస్ట్ చేయండి-" అన్నాడు వరప్రసాద్.

"నీలకంఠంగారికి మీరేమౌతారు?" ప్రశ్నించాడు డాక్టర్.

మౌనం వహించేరు వరప్రసాద్

"చెప్పండి-" రెట్టించేరు డాక్టర్.

"ఆయన నాకు యజమాని. తండ్రి లాంటివాడు ఆయన ఆదరణవల్లే నేను ఇంతవాణ్ణి అయ్యేను. దయచేసి మీరు నా బ్లడ్ టెస్ట్ చేయండి. మేచ్ అయితే వెంటనే నా రక్తం అమ్మగారికి ట్రాన్స్‌మిట్ చేయండి-ఆమె బతకాలి. అంతే నా కోరిక" అన్నాడు వరప్రసాద్.

గబగబా రక్తం తీసుకున్నాడు డాక్టర్ శాంతాదేవి బ్లడ్‌కి వరప్రసాద్ బ్లడ్ మేచ్ అయింది.

"సార్! యీయన బ్లడ్‌గ్రూప్ 'ఓ'- ఆమెకి సూటవుతుంది" అన్నాడు డాక్టర్ ఆనందంగా.

"పదండి సార్-" గదిలోంచి బయటకు అడుగులేస్తూ అన్నాడు వరప్రసాద్.

వరప్రసాద్ వెంట వెళ్ళాడు డాక్టర్-

వెళ్తున్న వరప్రసాద్‌వేపు ఆర్తిగా చూసేడు నీలకంఠం—

• • •

పావుగంట సేపు వివరంగా వీలునామా చదివేడు. అంతా శ్రద్ధగా విన్నారు. వాళ్ళ మొహాల్లో ఆనందం ఏ మాత్రం లేదు. వీలునామా చదవడం పూర్తిచేసి కుటుంబ సభ్యుల వేపు చూసేడు నీలకంఠం.

అంతా మౌనం వహించేరు—

"నా అభిప్రాయం మీకు వివరించేను. యిక మీ అభిప్రాయాలు నిర్భయంగా చెప్పండి" అన్నాడు నీలకంఠం.

నీలకంఠంవేపు చూసేరు. అతని కొడుకులు. గొంతుక సర్దుకున్నాడు రాజా.

"నాన్న- మీ స్థిర, చరాస్తుల్లో మా ముగ్గురికీ సమానంగా వ్రాసి యిచ్చేరు- సంతోషం-" ఆగేడు రాజా.

"మీ సంతోషమే- నాకు ఆనందం- తృప్తి" అన్నాడు నీలకంఠం.

"కానీ... మన యింట్లో వుండి చదువుకున్న ప్రసాద్‌కి... కూడా మీ వంతు స్థిర ఆస్థి- పుడ్ ప్రొడక్ట్, మీ తదనంతరం రాసి యివ్వడమే మాకు అనంతృప్తిగా వుంది..." అన్నాడు మూర్తి.

మూర్తి భార్య, రాజా, రాజాభార్య అతడికి "అనుకూలం" అన్నట్టుగా తలలు వూపేరు. వాళ్ళ అభిప్రాయాలూ చెప్పేరు.

వాళ్ళ మాటలువిన్న నీలకంఠం అందరివేపు చూసి చిరునవ్వు నవ్వేడు

"వాళ్ళన్నమాట విని నవ్వుతారేం— మీ ఆస్థి మీ యిష్టం... అంటారు. కాదనను- కాని- అనాథుడు తల్లీ తండ్రీ లేనివాడు అని చేరదీసి పెద్ద చదువులు చెప్పించేరు... నేను పెదవి విప్పలేదు. మీ కంపెనీలో తర్వాత మేనేజర్‌గా వేసేరు, కాదనలేదు. ఈరోజు మీ వంతు ఆస్థి వాడికిరాసి మీ కొడుకుల్తోపాటు పంచడం ఏమీ బాగులేదు... వాడిపేర రాసినది రద్దు చేయండి" అన్నది శాంతాదేవి.

నీలకంఠం నెమ్మదిగా నడుచుకుంటూ గుమ్మంవద్దకు వెళ్లాడు. గుమ్మంముందు నిల్చున్న వరప్రసాద్ భుజంమీద చెయ్యివేసి తనతోపాటు గదిలోకి తీసుకెళ్లాడు. భార్యా-బిడ్డలు-కోడళ్ళువేస్తు చూసేరు-

"శాంతా- నువ్వు వరప్రసాద్‌ని ఎన్నోసార్లు సూటిపోటి మాటలన్నావ్. తక్కువ కులంవాడని ఈసడించేవ్. నీ మాటలు విని భరించేడు... నీ మీద ఏనాడూ కోపం తెచ్చుకోలేదు- గౌరవం భక్తి పెంచుకున్నాడు. ఆరోజు నీకు రక్తం ఎక్కించాలని డాక్టర్ అంటే... మేమందరం నీకు రక్తం యిద్దామను కున్నాం. మా రక్తం నీకు సరిపోలేదు- రక్తం ఎక్కించకపోతే నువ్వుబతకవు- నీ రక్తం గ్రూప్‌గల రక్తం ఎక్కడా దొరకలేదు. ఆ సమయంలో నిన్ను రక్షించేడు...మా యింట దీపం వెలిగించింది- వీడే- యీ వరప్రసాదే! నువ్వు కులం తక్కువ వాడని దూరం చేసిన వ్యక్తి-రక్తం నీలో ప్రవేశించింది. నీ బతుకును బతికించింది. నీ రక్తం పంచుకుని పుట్టిన కొడుకులకన్నా... వీడే నయం..." ఆవేశంగా అని ఆగేడు నీలకంఠం.

"అంత మాత్రానికి... మీ వంతు ఆస్థి అతనికివ్వడం... సబబుగా లేదు— లక్షో-అరలక్షో ఇస్తే చాలు- అంతేగాని. మీ కొడుకులతో సమానంగా ఆస్తి యివ్వడం... ఏం బాగులేదు... ఆలోచించండి..." అన్నాడు రాజా.

"నాకు- ఎవరిని ఎలా చూడాలో- బాగా తెలుసు" అన్నాడు నీలకంఠం.

"తెలిసి తప్పు చెయ్యడం ఏమీ బాగు లేదు" అన్నాడు మూర్తి.

నీలకంఠం మూర్తివేపు కోపంగా

చూసేరు-

"అందరూ వినండి- నా నిర్ణయం మారదు. మీరనుకున్నట్టు వరప్రసాద్ అనాధకాదు- అతనికి తండ్రి వున్నారు- వరప్రసాద్ తండ్రి...ఎవరో కాదు... నేనే!" అన్నారు నీలకంఠం గంభీరంగా.

అతనన్న మాటలకు అందరితోపాటు వరప్రసాద్ కూడా విని ఆశ్చర్యపోయేరు.

"మీరు నిజంచెప్తున్నారా?" అనుమానంగా ప్రశ్నించేరు రాజా.

సీరియస్‌గా అందరివేపు చూసేరు నీలకంఠం.

"నేను... యింతవరకూ ఎవరినీ మోసం చెయ్యలేదు! అంత అవసరం యింతవరకూ కలగలేదు. నేను వరప్రసాద్‌కి తండ్రిని. మీ అమ్మ సాక్షిగా చెప్తున్నా..." నీలకంఠం గంభీరంగా అన్నాడు. అతనవేపు చూశారంతా-

అతని కళ్ళముందు గతం కదిలింది.

## 2

"నామాట నమ్ము! నిమ్మా, నీ కడుపున వున్న మన అబ్బాయికి అన్యాయం చేయను. ఈరోజే మన విషయం నాన్నగారికి చెప్పి వివాహానికి వెంటనే ముహూర్తం పెట్టిస్తాను... కుమారీ! ప్రామిస్!" రాజకుమారిని హృదయానికి గట్టిగా హత్తుకుంటూ అన్నాడు నీలకంఠం.

అతడన్న మాటలకు రాజకుమారి ఆనందంతో పులకితురాలైపోయింది,

రాజకుమారి తండ్రి మధ్యతరగతి వాడు. స్కూలు టీచర్. రాజకుమారి నీలకంఠం చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు అర్థంచేసుకుని ప్రేమించుకున్నారు- ఆ ప్రేమ మొక్క మంచి ప్రాంతమై పారిజాతం చెట్టులా నేడు అయింది. నీలకంఠం బి.ఎ పూర్తి చేసేరు. రాజకుమారి చదువు స్కూల్ ఫైనల్‌తో ఆగిపోయింది రోజూ వారిద్దరూ పార్కులోనో బీచ్‌లోనో కలుసుకుంటూ వుండేవారు నీలకంఠం యీ మధ్య తండ్రికి చేదోడుగా వుంటున్నాడు.

ఆరోజు!

రాజకుమారి నీలకంఠానికి తను తల్లిని కాబోతున్నానన్న వార్త చెప్పింది. నీలకంఠం ఆనందించేరు. అప్పటికే వారిరువురూ మానసికంగా భార్యాభర్తలయ్యేరు.

నీలకంఠం ఒక్కసారి చేతికున్న వాచీ చూసుకున్నారు వెంటనే ఆమెను వదిలేరు.

"కుమారీ! కొద్దిగా ఆఫీసుపని వుంది. రేపు రాను. ఎల్లుండి యిక్కడకు రా. నీకోసం ఎదురుచూస్తూ వుంటాను" అన్నాడు నీలకంఠం

ఆమె అంగీకారంగా తలవూపింది.

అంతవరకూ పొదలవెనక వున్న ఓ ఆకారం పక్కకు తప్పుకుంది,

నీలకంఠం రోడ్డుమీదకు వెళ్ళాడు-

• • •

"నువ్వు చెప్తూంది నిజమేనా? నన్ను నమ్మమంటావా శేషగిరీ!" ఆశ్చర్యంగా ప్రశ్నించేడు ధర్మారావు.

శేషగిరి నల్ల బ్యాగ్ లోంచి కొన్ని ఫోటోలు తీసి చూపించేడు; ఆ ఫోటోలు చూసిన ధర్మారావు షాక్ తిన్నాడు.

"బావా! నీ కొడుకు అమాయకుడు- అతన్ని మంచి చేసుకోవాలనుకుంది. వలలో వేసుకుంది ఎందుకు? బికాజ్ నీ ఆస్తిని కాజేయాలని. నేను కాకతాళీయంగా వాళ్ళిద్దరినీ చూసేను. ఏదో కథ వుందని అనుమానించేను. వాళ్ళ వెనక ఫాలో అయ్యేను. రహస్యంగా ఫోటోలు తీసేను. ఎందుకు? నువ్వు నమ్మడానికి... దట్సాల్!" ఆగేడు శేషగిరి.

ధర్మారావు కళ్ళు మూసుకున్నాడు- ఏంచేయాలన్న ఆలోచనలో పడ్డాడు.

"బావా! నేను ఒక పథకం ఆలోచించేను." ఖుషీగా అన్నాడు శేషగిరి.

కళ్ళు తెరచి శేషగిరివేపు చూసేడు- శేషగిరి నవ్వేడు.

"బావా! నీ కుటుంబగౌరవం నిలవాలి, ఆ రాజకుమారి మీవాణ్ణి వదలాలి... అంతేనా?"

ఔనన్నట్టుగా తలూపేడు ధర్మారావు.

శేషగిరి ధర్మారావు దగ్గరకు వచ్చి "ఓ లక్ష యిలా పారేయ్ బావా!" శేషగిరి అన్నాడు నవ్వుతూ.

"ఎందుకూ!""

"చెప్తా! ఆ రాజకుమారి కావడు రాజకుమారికి పెళ్ళి రేపు రాత్రి చెయ్యించడానికి. అదీ రహస్యంగా దూర ప్రదేశంలో. ఖర్చులు నువ్వే భరించాలి, తప్పదు. నీ కొడుక్కి వచ్చే వారంలో వెంటనే పెళ్ళిచెయ్యాలి అలా చెయ్యక పోతే నీ కొడుకు పిచ్చివాడౌతాడు" అన్నాడు శేషగిరి.

"నీ ఆలోచన దివ్యంగా వుంది... కానీ హఠాత్తుగా మావాడికి అనుకూలమైన అమ్మాయి దొరకొద్దూ" సంశయంగా అన్నాడు ధర్మారావు

"నీకా అనుమానం అక్కర్లేదు... మా కాంత, అంటే నీ మేనకోడలు రెడీగా వుంది అందం సంగతి నీకు తెలుసు! నువ్వు వూఁ అంటే మా పిల్ల నీ కోడలు పిల్ల అవుతుంది, నో డౌట్. ఏమంటావ్? ఓ అన్నాడు శేషగిరి.

ధర్మారావు శేషగిరివేపు చూసేడు. అంగీకారంగా తలవూపేడు.

ఆ రాత్రి...

నీలకంఠం రాజకుమారిని ప్రేమించినట్టు ఆమెనే తను పెళ్ళిచేసుకుంటానని ధైర్యంగా చెప్పేడు.

"వెల్! నీ అభిప్రాయం చెప్పేవ్- కానీ ఆ అమ్మాయికి ఆస్తి లేదు... పేదవాళ్ళు-"

"వాళ్ళు పేదవాళ్ళే...కానీ గుణానికి గొప్పవారు..."

"ఆఁ... డబ్బును మించినదేదీ ఈ

లోకంలో లేదన్నాయ్- నీకు లోకజ్ఞానం లేదు...ఆ అమ్మాయి నా కోడలుగా... రావడం కష్టం-" అన్నాడు ధర్మారావు.

"నాన్నగారూ-మీరు ఆలోచించండి- డబ్బు శాశ్వతం కాదు-ప్రేమానురాగాలు శాశ్వతం- మీరు మమ్మల్ని భార్యా భర్తలుగా చేయండి... ఆ అమ్మాయి-యిప్పుడు..."

"నీకు దక్కదు- ఆ అమ్మాయికి అధార్తుగా వాళ్ళ బావతో రేపు రాత్రి పెళ్ళి- నిశ్చయం అయింది. ఆ విషయం ఆ అమ్మాయి నాన్న నావద్దకు వచ్చి చెప్పేడు...సో...యిక ఆ అమ్మాయిని నీ మనసులోంచి... తప్పించుకో... లక్షణంగా నీ మేనమామ కూతుర్ని పెళ్ళి చేసుకో... ఇంతకన్నా నీకు మంచి మార్గం లేదు..." అన్నాడు ధర్మారావు.

నీలకంఠం ధర్మారావు చెప్పింది విని ఆశ్చర్యపోయేడు. కలా? నిజమా- తన రాజకుమారి తనను మోసం చేసిందా?

వెంటనే అక్కణ్ణుంచి వెళ్ళిపోయేడు. రాజకుమారి ఇంటికి వెళ్ళేడు. రాజకుమారి యింటి తలుపులు వేసివున్నాయ్. తలుపుకున్న తాళంకప్ప నీలకంఠాన్ని వెక్కిరించింది-

ఆ తర్వాత—

ఎన్నో మార్పులు చకచకా జరిగి పోయేయ్- కాంతకు యిద్దరు పిల్లలు కలిగేరు. ధర్మారావు కాలం చేసేడు. నీలకంఠం తండ్రి వ్యాపారాన్ని అభివృద్ధి చేసేడు. కాంతాదేవి పిల్లల్ని పెంచుతూ- ఆనందంగా గడుపుతోంది-

"కాంతా!" పిల్చేడు నీలకంఠం-

భర్త వేపు చూసింది. భర్తపక్క- ఆరేళ్ళుదాటిన కుర్రాడు నిల్చునివున్నాడు.

"ఈ కుర్రాడు... నా స్నేహితుని కొడుకు...అతనికి భార్యపోయి రెండేళ్ళ అయింది. నేను నా స్నేహితుణ్ణి కాకతాళీయంగా ఆసుపత్రిలో కలిసేను: అతను చావుబతుకుల్లో వున్నాడు. తను బతకనని ఈ పిల్లణ్ణి అనాధ ఆశ్రమంలో చేర్చమని కోరేడు- నేనే పెంచిపెద్దవాణ్ణి చేస్తానని మాట ఇచ్చేను ఆ మాట విని అతడు తృప్తిగా కన్ను మూసేడు..." అన్నాడు నీలకంఠం.

"మీరు 'దానకర్ణులు- ఆదర్శ పురుషులు- మీరిచ్చిన మాట తప్పరు- మీ మాటను నేను కాదనగలనా- అలాగే- ఎందరు యీ యింట్లో తిని బతకలేదు, వాళ్ళలో వీడొకడు" అంది కాంత.

ఆ రోజునుంచీ వరప్రసాద్ నీలకంఠం యింట్లో వుండి పెరిగి పెద్దవాడయ్యేడు

## 3

"...నేనానాడు రాజకుమారికి సరైన న్యాయం చేయలేకపోయేను. అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. చావు బతుకుల్లోవున్న ఆమెకు చేసిన వాగ్దానం ప్రకారం వరప్రసాద్‌కి పెద్ద చదువు చెప్పించేను. మంచి హోదా యిచ్చేను.

కానీ నాకు తృప్తి కలగలేదు... వాడికి మీతోపాటుగా నా ఆస్తిలో నా తదనంతరం నా వంతు భాగం రాసి యిచ్చేను. నా కథ మీకు చెప్పేను. నాకు యిప్పుడు హాయిగా తృప్తిగా వుంది వరప్రసాద్ నా కొడుకు..." నీలకంఠం ఆవేశంగా చెప్పేడు... వొక్కసారి ఊపిరి తీసుకున్నాడు

నీలకంఠం చెప్పిందంతా విని- నీలకంఠం కుటుంబ సభ్యులు పశ్చాత్తాపంతో తలలు వంచుకున్నారు

"అన్నయ్యా- మమ్మల్ని మన్నించు- యిన్నాళ్ళు నిన్ను అనరాని మాటలు అన్నాం-" అన్నారు బాధగా నీలకంఠం కొడుకులు.

'బావగారూ- మమ్మల్ని క్షమించాలి- మా వంతూ తప్పుంది-" అన్నారు నీలకంఠం కోడళ్ళు.

కాంతాదేవి కుర్చీలోంచి లేచి నెమ్మదిగా వరప్రసాద్ వద్దకు వెళ్ళింది. అతన్ని దగ్గరగా తీసుకుని తల నిమురుతూ—

"బాబూ... నిన్ను... అజ్ఞానంతో... అహంకారంతో అనరాని మాటలు అన్నాను- నీ మనసు బాధపెట్టేను. నిన్ను యిన్నాళ్ళు దూరం చేసుకున్నాను. నా ప్రాణం పోతున్న తరుణంలో నీ రక్తం యిచ్చి నన్ను బతికించేవు. నాకు పునర్జన్మ యిచ్చేవు- నిన్ను యిక దూరంగా వుంచుకోను- యిక నువ్వు మాతో వుండు- యీ తల్లి మాట కాదనకు. ప్లీజ్!" ప్రేమగా అంది కాంతాదేవి

— వాళ్ళందరి మాటలు విన్న నీలకంఠం- మనసు ఆనందంతో పొంగి పోయింది. అతడి కళ్ళు తడిసేయి.

'రాజకుమారీ- నీకు ఆనాడు అన్యాయం చేసేను... కానీ యీనాడు... మన వరప్రసాద్‌కి న్యాయం చేసేను. ఇన్నాళ్ళకి నీ మనస్సుకి శాంతి కలిగించేను'— తృప్తిగా మనసులో అనుకున్నాడు నీలకంఠం...

* * *

